పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

కార్పొరేషన్, జూలై 1: నగరంలో పారిశుధ్య పనుల్లో ఎక్కడైనా నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ హెచ్చరించారు. సోమవారం నగరపాలక సంస్థలో పారిశుధ్య విభాగం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య పనుల పర్యవేక్షణ, దవాఖానల బయో వ్యర్థాలను వేరు చేయించడం, తదితర అంశాలకు సంబంధించి సూచనలు చేశారు. సమావేశంలో పారిశుధ్య అధికారులు వెంకన్న, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పూర్తయిన పదోన్నతులు, బదిలీలు

కమాన్‌చౌరస్తా, జూలై 1 : జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన పదోన్నతులు, బదిలీల ప్రక్రియ సోమవారం పూర్తయింది. జిల్లాలో అర్హులైన ఎస్జీటీలు స్కూల్ అసిస్టెంట్లుగా, భాషా పండితులు, పీఈటీలు 485 మందికి పదోన్నతులు లభించాయి. అలాగే, జిల్లాలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు (ఎస్జీటీ) 488 మందికి స్థాన చలనం కల్పిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీకాగా, వారు ఎంఈవో, స్కూల్ కాంప్లెక్స్ కార్యాలయాల్లో రిపోర్టు చేస్తున్నారు. శనివారం రాత్రి, ఆదివారం రాత్రి వరకు వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ముగియగా, సోమవారం ఉదయం నుంచి రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ నుంచి బదిలీల ఉత్తర్వుల కాపీలను ఆన్‌లైన్‌లో అందజేశారు. దీంతో ఉపాధ్యాయులు వారికి కేటాయించిన పాఠశాలలో విధుల్లో చేరేందుకు సిద్ధమయ్యారు.

జాతీయస్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు

కొత్తపల్లి, జూలై 1 : మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్‌లో ఈ నెల 7 నుంచి 11 వరకు జరుగనున్న 50వ జాతీయస్థాయి జూనియర్ వాటర్ పోలో చాంపియన్‌షిప్-2024 పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు కంకణాల శ్రీవర్, హాశీక ఎంపికయ్యారు. వీరిని సోమవారం జిల్లా యువజన, క్రీడాశాఖాధికారి బీ శ్రీకాంత్‌రెడ్డి అభినందించి, జాతీయ పోటీల్లో సత్తాచాటి జిల్లాకు మంచి పేరును తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో స్విమ్మింగ్ కోచ్‌లు కే చంద్రశేఖర్, ఈ సంపత్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఇల్లందకుంట, జూలై 1: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జమ్మికుంట రూరల్ సీఐ కిశోర్ సూచించారు. సోమవారం శ్రీరాంలపల్లి గ్రామంలో సైబర్‌నేరాలు, గంజాయి వాడకంతో కలిగే దుష్ప్రభావాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామస్తులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాలు జరిగినప్పుడు పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఇక్కడ ఎస్ఐ రాజ్‌కుమార్, పోలీసులు, గ్రామస్తులు ఉన్నారు.

శాతవాహన యూనివర్సిటీలో వనమహోత్సవం

యూనివర్సిటీలో మొక్క నాటుతున్న అధికారులు, విద్యార్థులు

కమాన్‌చౌరస్తా, జూలై 1: శాతవాహన విశ్వవిద్యాలయంలో వనమహోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా యూనివర్సిటీ ప్రాంగణంలో 200 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీఎన్ రావు హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బీఎన్ రావు, విశిష్ట అతిథిగా శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎం వరప్రసాద్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ ఎన్వీ శ్రీరంగప్రసాద్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఈ మనోహర్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ డీ హరికాంత్ హాజరై విద్యార్థులతో మొక్కలు నాటించారు. వాటి సంరక్షణ బాధ్యత విద్యార్థులకు అప్పగించారు. అలాగే, డాక్టర్ల దినోత్సవం సందర్భంగా బీఎన్ రావును యూనివర్సిటీ అధికారులు సత్కరించారు. కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కంచు తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించగా, అధ్యాపకులు డాక్టర్ మనోజ్ కుమార్, బండ నరేశ్, డాక్టర్ బీ పరశురాములు, ఎంకామ్, ఎంబీఏ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

పవన్ పద్మ హాస్పిటల్‌లో వైద్యులను సన్మానిస్తున్న మా లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ శాతవాహన అధ్యక్షుడు, తదితరులు

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో సన్మానం పొందిన డాక్టర్లు, సీఏలు, పోస్టల్ వర్కర్లు

ఘనంగా వైద్యుల దినోత్సవం

విద్యానగర్, జూలై 1: మా లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ శాతవాహన అధ్యక్షుడు చెన్నమనేని రాంమోహన్ రావు ఆధ్వర్యంలో సోమవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కరీంనగర్‌లోని పవన్ పద్మ హాస్పిటల్‌లో వైద్యులు ఈ పవన్ కుమార్, ఈ పద్మ ప్రియ, ఎల్ రవికాంత్, డీ గీతాంజలిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రతినిధులు సంఘోజు మనోహరాచారి, మేచినేని సత్యనారాయణరావు, నడిపెల్లి ప్రసాదరావు, మర్రిపల్లి మహేందర్, కోశాధికారి లయన్ పచ్చునూరి సురేందర్, లయన్ కోట సత్యం పాల్గొన్నారు. ఐఎంఏ హాల్‌లో లయన్ ఇంటర్నేషనల్ 320 జీ ఆధ్వర్యంలో డాక్టర్లు, సీఏలు, పోస్టల్ వర్కర్లను సన్మానించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా డాక్టర్ బంగారు స్వామి, నిరంజనాచారి, నడిపెల్లి ప్రసాద్ రావులు వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గవర్నర్ నడిపెల్లి వెంకటేశ్వరరావు హాజరయ్యారు. డాక్టర్ ఐ శ్రీధర్‌రావు, డాక్టర్ రాజేశ్వర్, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ రవీంద్రన్, డాక్టర్ వినయ్ కుమార్, సీఏలు నిరంజనాచారి, ఆనంద్ కుమార్, గణేశ్వరం, పోస్టల్ వర్కర్స్ సదయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కోదండరాం, భద్రేశం, చిత్ర, సురేశ్, శ్రీనివాసరావు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జార్జ్ పాఠశాలలో వైద్యుల దినోత్సవంలో చిన్నారులు

కరీంనగర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ భాస్కర్ మాడేకర్ ఉదార నేత్ర వైద్యశాలలో డాక్టర్స్‌డే సందర్భంగా సోమవారం డాక్టర్లు శ్వేత, స్వాతి, హారిక, మైమున మహవిష్, స్వాతిశ్రీని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. హాస్పిటల్‌లో పరికరాలను చూసి అభినందించారు. పేద వారికి మరింత మెరుగైన వైద్యం అందించాలన్నారు. హాస్పిటల్ చైర్మన్ కొండ వేణు మూర్తి మాట్లాడుతూ, ఉచిత, పేమెంట్ సర్జరీస్‌కు హాస్పిటల్ సేవలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ చిదుర సురేశ్, కార్యదర్శి ప్రకాశ్ హోల్ల, ట్రస్ట్ సభ్యులు మురళీధర్ రావు, కోల అన్నారెడ్డి, క్లబ్ అధ్యక్షులు ముక్క శరత్ కుమార్, కార్యదర్శి శివకాంత్ పాల్గొన్నారు.

సెయింట్ జార్జ్ పాఠశాలలో

కొత్తపల్లి, జూలై 1 : డాక్టర్స్ డే సందర్భంగా నగరంలోని రేకుర్తి, విద్యానగర్, తీగలగుట్టపల్లిలోని సెయింట్ జార్జ్ నినోస్ బ్లాక్ (సీబీఎస్ఈ) విద్యాసంస్థల్లో విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. డాక్టర్ వేషధారణలో హాజరైన విద్యార్థులు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యాసంస్థల చైర్మన్ డా. పీ ఫాతిమారెడ్డి మాట్లాడుతూ, ప్రజల ప్రాణాలను కాపాడడంలో వైద్యుల కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భార్గవ్, నిరంజన్, ఇన్‌చార్జిలు సంగీత, సంధ్య, స్వప్న, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 370 దరఖాస్తులు

ప్రజావాణిలో వినతిపత్రాలు స్వీకరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, ఇతర అధికారులు

కలెక్టరేట్, జూలై 1 : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 370 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో అత్యధికంగా నగర పాలక సంస్థలో పెండింగ్‌లో ఉన్న సమస్యలపై 50 అర్జీలు అందాయి. జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయానికి 26, రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయానికి 16, ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయానికి 16, పోలీస్ కమిషనర్ కార్యాలయానికి 13 అర్జీలు వచ్చాయి. అలాగే, ఇతర ప్రభుత్వ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలపై కూడా భారీగానే ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కాగా, ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు అప్పగించి, సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

ప్రజావాణి కొచ్చి...సొమ్మసిల్లిపోయి

హుజూరాబాద్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన కన్నం వెంకటయ్య అనే వృద్ధుడు తాను ఎదుర్కొంటున్న సమస్యపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చి, సొమ్మసిల్లి పడిపోయాడు. అతడిని గమనించిన పోలీసులు వెంటనే మంచినీళ్లు అందించారు. తేరుకున్న అనంతరం సమస్య విన్న అదనపు కలెక్టర్, సమస్యను సత్వరమే పరిష్కరించాలంటూ సంబంధితాధికారులను ఆదేశించారు.

ఉచిత బ్లడ్ గ్రూప్ నిర్ధారణ శిబిరం

కలెక్టరేట్, జూలై 1 : ఇండియన్ యూత్ సెక్యూర్డ్ ఆర్గనైజేషన్ (ఐసో) టీం 19వ వార్షికోత్సవం సందర్భంగా నగరంలోని కలెక్టరేట్ ఎదుట సోమవారం ఉచిత బ్లడ్ గ్రూప్ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌కు వచ్చిపోయే వారి రక్త నమూనాలు సేకరించి, వారి రక్తగ్రూపు వివరాలు ఐసో టీం ప్రతినిధులు అందజేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిబిరం కొనసాగగా, 500 మందికి పైగా బ్లడ్ గ్రూపు నిర్ధారణ చేసినట్లు బృందం సభ్యులు తెలిపారు.

ప్రతి రైతుకూ 'రైతు భరోసా' ఇవ్వాల్సిందే

- అభిప్రాయ సేకరణలో రైతుల డిమాండ్

జమ్మికుంట, జూలై 1: వ్యవసాయ ఉత్పాదకత, రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం 'రైతు భరోసా' పథకాన్ని కొనసాగించాలని, సకాలంలో సాగు చేసే ప్రతి రైతుకూ భరోసానివ్వాల్సిందేనని సహకార సంఘాల పాలకవర్గాలు, రైతులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా సహకార సంఘాల ఆడిట్ అధికారి మనోజ్‌కుమార్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ ముంజాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం జమ్మికుంట, ధర్మారం, తనుగుల పీఏసీఎస్‌ల పరిధిలో సింగిల్ విండో కార్యాలయాలు, రైతు వేదికల్లో రైతు భరోసాపై ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేశారు. ఈ సందర్భంగా ఆయా సమావేశాల్లో రైతులు, పాలకవర్గాల బాధ్యులు మాట్లాడుతూ.. రైతు భరోసా కొనసాగితేనే రైతులకు మేలు జరుగుతుందని, అభిప్రాయ సేకరణల పేరిట కాలయాపన తగదన్నారు. సమావేశాల్లో వెల్లడించిన అభిప్రాయాలను అధికారులు రికార్డు చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు. జమ్మికుంట, ధర్మారం, తనుగుల పీఏసీఎస్ సమావేశాల్లో పాలకవర్గం, రైతులు, ఏవో, ఏఈవోలు, సహకార సంఘాల సభ్యులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

గట్టుదుద్దెనపల్లి సొసైటీలో

మానకొండూర్ రూరల్, జూలై 1: గట్టుదుద్దెనపల్లి విశాల సహకార సంఘం అధ్యక్షుడు అనభేరి రాధా కిషన్ రావు ఆధ్వర్యంలో సంఘం ఆవరణలో రైతు భరోసాపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. రైతుల అభిప్రాయాలను సేకరించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిరణ్ కుమార్ హాజరుకాగా, ఉపాధ్యక్షుడు అనంత రెడ్డి, ఏఈవోలు, పాలకవర్గం, రైతులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ సిబ్బంది రక్తదానం

కార్పొరేషన్, జూలై 1: భారతీయ స్టేట్ బ్యాంకు 69వ అవతరణ దినోత్సవం సందర్భంగా రీజినల్ బిజినెస్ ఆఫీస్ ఆధ్వర్యంలో స్థానిక మెయిన్ బ్రాంచ్ ఆవరణలో రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ సౌజన్యంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మంది బ్యాంకు సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో బ్యాంకు రీజినల్ మేనేజర్ ఎస్.వెంకటేశ్, చీఫ్ మేనేజర్ రామచంద్రు, బ్రాంచ్ మేనేజర్ మణికుమార్, హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు ఘన స్వాగతం

కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు, నాయకులు

అల్గునూర్‌లో కేటీఆర్‌కు ఆయన చిత్రపటాన్ని అందజేస్తున్న దేవేందర్ రెడ్డి, తదితరులు

తిమ్మాపూర్/కార్పొరేషన్, జూలై 1: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు జిల్లాలో నాయకులు ఘన స్వాగతం పలికారు. సోమవారం జగిత్యాల జిల్లాలో ముఖ్య కార్యకర్తల సమావేశానికి వెళ్తున్న ఆయనకు ముందుగా తిమ్మాపూర్ మండలం అల్గునూర్ చౌరస్తాలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకగా, రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి కేటీఆర్ ఫొటోలతో కూడిన చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం ఎన్టీఆర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్ కేటీఆర్‌ను గజమాలతో సత్కరించి, స్వాగతం పలికారు. పలువురు కార్పొరేటర్లు, నాయకులు కేటీఆర్‌ను శాలువాలతో సత్కరించారు. అనంతరం అక్కడి నుంచి కేటీఆర్ పాటు జిల్లా బీఆర్ఎస్ నాయకులు సైతం జగిత్యాలకు తరలివెళ్లారు. కార్యక్రమంలో మాజీ మేయర్ రవీందర్‌సింగ్, తిమ్మాపూర్ మండలాధ్యక్షుడు రావుల రమేశ్, కార్పొరేటర్లు సల్ల శారదారవీందర్, వాల రమణారావు, ఐలేందర్, గందె మాధవి, పోరండ్ల సొసైటీ చైర్మన్ స్వామి రెడ్డి, పాశం అశోక్ రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ధరణి పెండింగ్ దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

కలెక్టరేట్, జూలై 1: ధరణి పెండింగ్ దరఖాస్తులను తహసీల్దార్లు యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. తహసీల్దార్ లాగిన్‌లో ఉన్న పెండింగ్ అర్జీలను సత్వరమే పరిశీలించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో వందశాతం పూర్తి చేయాలని, వీటిపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండకూడదని సోమవారం నిర్వహించిన సమావేశంలో తేల్చి చెప్పారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, రెవెన్యూ విభాగపు అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీపీవో పీ పవన్‌కుమార్, ఆర్డీవోలు కుందారపు మహేశ్వర్, రమేశ్ బాబు, కలెక్టరేట్ ఏవో గడ్డం సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్సీ కమిషన్ సభ్యుడి పర్యటన

కలెక్టరేట్, జూలై 1 : జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ జిల్లా పర్యటన నేపథ్యంలో అన్ని వివరాలతో అధికారులు సిద్ధంగా ఉండాలని, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీకిరణ్ ఆదేశించారు. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కలెక్టరేట్‌లో మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు అన్ని శాఖల అధికారులతో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు సమీక్ష నిర్వహించనున్నారని పేర్కొన్నారు. సమావేశంలో డీఆర్వో పవన్ కుమార్, డీపీవో రవీందర్, సీపీవో కొమురయ్య, సోషల్ వెల్ఫేర్ ఇన్‌చార్జి డీడీ హమీద్, ఎల్ డీ ఎం ఆంజనేయులు, డీఈవో జనార్దన్ రావు, జిల్లా వైద్యాధికారి సుజాత, తదితరులు పాల్గొన్నారు.

కురుమలకు మంత్రి వర్గంలో చోటు కల్పించాలి

తెలంగాణచౌక్, జూలై 1: రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా వెనుకబడిన కురుమ కులస్తులకు రాష్ట్ర ప్రభుత్వం సముచిత స్థానం కల్పించాలని కురుమ సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కర్రె పావని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. నగరంలోని ప్రెస్ భవనంలో జిల్లా కమిటీ సభ్యులతో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కురుమ వృత్తిదారులు తగిన ఆదాయం లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కురుమలకు ఉపాధి ఉద్యోగావకాశాల్లో ప్రాధాన్యత కల్పించాలన్నారు. నాయకురాళ్ల అనిత, అంజలి, సంధ్య పాల్గొన్నారు.

స్కాలర్ షిప్‌లను విడుదల చేయాలని వినతి

తెలంగాణచౌక్, జూలై 1: విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్ మెంట్ రాకపోవడంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీ మేరకు బకాయిలను విడుదల చేయాలన్నారు. నాయకులు హేమంత్, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

ధర్నాలను విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, జూలై 1: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8. 9 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో నిర్వహించ తలపెట్టిన ధర్నాలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నగరంలోని పార్టీ కార్యాలయం ముకుందలాల్ మిశ్రా భవనంలో సోమవారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తహసీల్దార్ కార్యాలయాల ఎదుట చేపట్టనున్న ధర్నా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ముకుందరెడ్డి, వర్ణ వెంకటరెడ్డి, సత్యం, భీమాసాహెబ్, శ్రీనివాస్, ఎడ్ల రమేశ్, సంపత్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడి మృతి

సైదాపూర్, జూలై 1: శివరాంపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కచ్చు ఐలయ్య ఆదివారం మృతిచెందగా, సోమవారం మృతదేహాన్ని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, సింగిల్‌విండో చైర్మన్ బిల్ల వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ ఏనుగుల ఐలయ్య, బీఆర్ఎస్ యూత్ మండల నాయకులు మాదం స్వామియాదవ్, గ్రామాధ్యక్షుడు ములుగు సంపత్ సందర్శించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామంలో బీఆర్ఎస్ పటిష్టానికి ఐలయ్య చేసిన కృషి మరువలేనిదన్నారు. వీరితో పాటు నాయకులు పోలు వెంకట్రాజం, సర్దార్, ప్రభాకర్, భిక్షపతి నివాళులర్పించారు.

జిల్లా యువజన అధ్యక్షుడిగా రెడ్డి సురేశ్ ముదిరాజ్

తెలంగాణచౌక్/ శంకరపట్నం, జూలై 1: తెలంగాణ ముదిరాజ్ మహాసభ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా శంకరపట్నం మండలం రాజాపూర్ గ్రామానికి చెందిన రెడ్డి సురేశ్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర యువజన అధ్యక్షుడు పండుగ బాలు ముదిరాజ్ సోమవారం తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలకు సైన్స్ పరికరాల వితరణ

వీణవంక, జూలై 1: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 1976-77 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు రూ.10 వేల విలువైన సైన్స్ పరికరాలను వితరణ చేశారు. ఇక్కడ పూర్వ విద్యార్థి, మాజీ సర్పంచ్ చిన్నాల అయిలయ్య యాదవ్, హెచ్ఎం పులి అశోక్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు కంకణాల కొమురయ్య, కన్వీనర్ సూరోజు శ్రీనివాస్, ఉపాధ్యాయులు సురేశ్ బాబు, శాంత, వెంకట్రాజం, లింగయ్య, రాజశేఖర్, రాజు, శ్రీనివాస్, సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యసంపదను పెంపొందించుకోవాలి

చిగురుమామిడి, జూలై 1: ముదిరాజ్ కులస్తులు మత్స్యసంపదను పెంపొందించుకొని లాభాల బాటలో ముందుకు వెళ్లాలని ఇందుర్తి ఎంపీటీసీ 2 కోమటిరెడ్డి చంద్రకళ, మాజీ సర్పంచులు సన్నిల్ల వెంకటేశం, గునుకుల అమూల్య సూచించారు. ఇందుర్తి, గాగిరెడ్డి పల్లె పరిధిలోగల సంఘోజి పేట చెరువుకు రూ.రెండు లక్షలతో మత్తడి వద్ద సోమవారం వల ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వల ఏర్పాటుతో మత్స్యకారులకు ఆదాయం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, మండలాధ్యక్షుడు పైడిపల్లి శ్రీనివాస్, సహకార సంఘం అధ్యక్షుడు గట్టు శ్రీనివాస్, కార్యదర్శి కూన ముత్తయ్య, మాజీ ఎంపీటీసీ రాజేశ్వర్ రెడ్డి, నాయకులు అన్నాడి మల్లారెడ్డి, కూన పోచయ్య, బొమ్మగాని మధుసూదన్, అచ్చ రవీందర్, కంది శంకర్ తదితరులు పాల్గొన్నారు.

WANTED
jobs
★ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 16K to 18K ఏజెంట్ కమిషన్ 6K. 9640258899, 9640468899.
NT-325755

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సహకార సంఘం పెట్రోల్ బంకు ప్రారంభం

మానకొండూర్ రూరల్, జూలై 1: మండలంలోని గంగిపల్లిలో ధనలక్ష్మి విత్తన సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన పెట్రోల్ బంకును సోమవారం ఐవోసీఎల్ వరంగల్ డివిజనల్ రిటేల్ సేల్స్ ఆఫీసర్ రోషన్ సావాయ్ సంఘం అధ్యక్షుడు పారిపెల్లి శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బంకును రైతులు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం సొసైటీ అధ్యక్షుడితో పాటు ఎంపీటీసీలు రంగు భాస్కరాచారి, చలిగంటి సంపత్ ఐవోసీఎల్ డివిజనల్ రిటేల్ సేల్స్ ఆఫీసర్ రోషన్ సావాయ్‌తో పాటు ఐవోసీఎల్ సీనియర్ సేల్స్ ఆఫీసర్ నరేశ్, మేనేజర్ షఫీక్‌ను శాలువాలతో సన్మానించారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

శంకరపట్నం, జూలై 1: తల్లిదండ్రుల హితవు నచ్చని ఓ యువకుడు పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన శంకరపట్నం మండలంలోని కరీంపేట్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంపేట్ గ్రామానికి చెందిన గుర్రం సాయిరాం (21) అనే యువకుడు డిగ్రీ చదివి కరీంనగర్‌లోని ఓ రెస్టారెంట్‌లో పని చేస్తున్నాడు. ఆదివారం రోజు వీడియో కాల్ చేసి తల్లిదండ్రులతో మాట్లాడాడు. సోమవారం తెల్లవారుజామున యువకుడి తండ్రి నాగరాజు తమ ఖాళీ స్థలంలోని బాత్‌రూమ్‌కు వెళ్తుండగా ఖాళీ స్థలంలో సాయిరాం అచేతనంగా పడి ఉన్నాడు. పక్కనే పురుగుల మందు డబ్బా ఉంది. అప్పటికే మృతి చెంది ఉన్నాడు. కాగా, కొంతకాలంగా యువకుడి ప్రవర్తన సరిగా లేకపోవడంతో మార్చుకోవాలని తల్లిదండ్రులు హితవు పలికారు. ఇది నచ్చని యువకుడు ఇంటికి రావడం మానేశాడు. చివరకు తొందరపాటుతో విచక్షణ కోల్పోయి ఆత్మహత్య చేసుకున్నాడు. నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

తిమ్మాపూర్ రూరల్, జూలై 1: మండలంలోని జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (అటానమస్) కళాశాల ఆవరణలో గల సాయిబాబా ఆలయ తొమ్మిదో వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. జ్యోతిష్మతి విద్యాసంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్ రావు, చైర్ పర్సన్ జువ్వాడి విజయ, సెక్రటరీ కరస్పాండెంట్ సుమిత్ సాయి పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ రావు, డీన్ అకాడమిక్ డాక్టర్ పి.కె. వైశాలి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడికల్‌లో చిరు వ్యాపారుల ధర్నా

శంకరపట్నం, జూలై 1: తాడికల్ గ్రామంలో రోడ్డు విస్తరణలో భాగంగా సోమవారం మండల పరిషత్ అధికారులు ప్రధాన రహదారిపై ఆక్రమణల తొలగింపు చేపట్టగా, పలువురు చిరువ్యాపారులు ఆందోళనకు దిగారు. తమ కుటుంబాలకు జీవనాధారం అయిన టేలాలు, షెడ్లను తొలగించవద్దని ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నాకు దిగగా, పోలీసులు వచ్చి వారికి నచ్చజెప్పి శాంతింపజేశారు. కాగా, నోటీసులు ఇచ్చి నెల దాటిందని, రోడ్డు ప్రమాదాల నివారణకు తప్పనిసరి పరిస్థితుల్లోనే ఆక్రమణలను తొలగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇక్కడ ఎంపీడీవో, గ్రామ ప్రత్యేకాధికారి శ్రీవాణి, ఎంపీవో బషీరొద్దీన్, తాడికల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి సమ్మ రాజేశ్వర్‌తో పాటు పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రజావాణికి పది దరఖాస్తులు

ముకరంపుర, జూలై 1: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం కరీంనగర్ సర్కిల్, డివిజన్ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించిన విద్యుత్ ప్రజావాణి కార్యక్రమంలో వినియోగదారుల నుంచి పది దరఖాస్తులు అందాయి. ఇందులో సర్కిల్ కార్యాలయానికి సంబంధించి మూడు, కరీంనగర్ టౌన్ డివిజన్‌కు ఐదు, కరీంనగర్ రూరల్ డివిజన్‌కు సంబంధించి రెండు చొప్పున మొత్తం 10 దరఖాస్తులు స్వీకరించామని, తక్షణ పరిష్కారం కోసం సంబంధిత సెక్షన్లకు పంపించినట్లు ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. కార్యక్రమంలో డీఈ విజేందర్ రెడ్డి, ఎస్ఏవో రాజేశం, ఏడీఈలు స్వప్న, వీణ, తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు, ఉద్యోగులకు సన్మానం

గంగాధర/ చొప్పదండి, జూలై 1: ఇంటర్‌నేషనల్ డాక్టర్స్‌డే, చార్టెడ్ అకౌంటెంట్స్‌డే, పోస్టల్ వర్కర్స్‌డే సందర్భంగా గంగాధర లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం గంగాధరలో ఆయా శాఖల ఉద్యోగులను సన్మానించారు. గ్రామాల్లో ఉద్యోగులు చేస్తున్న సేవలకు లయన్స్‌క్లబ్ సభ్యులు కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు శ్రీరాం శ్రవణ్, సభ్యులు పోలు సమ్మయ్య, బుచ్చిరాములు, పర్రెం లక్ష్మారెడ్డి, ఉడుత శ్రీనివాస్, ఆళ్ల విజేందర్‌రెడ్డి, రావుల సతీశ్, కముటం అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండిలో డాక్టర్స్ డే సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యులు విక్రమ్, సాయికృష్ణను, పోస్టల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పోస్ట్‌కార్యాలయంలో పోస్ట్‌మాన్‌లను సన్మానించారు. 320 జీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ సభ్యులు కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మహేశుని మల్లేశం, కార్యదర్శి రాజేశ్ పవార్, ప్రోగ్రాం చైర్మన్లు సిరిపురం రాజు, కొల్లూరి జితేందర్, తాటికొండ శ్రీనివాస్, జిల్లా కో ఆర్డినేటర్లు కొల్లూరి ఆనందం, వల్లాల కృష్ణహరి, సభ్యులు పెద్ది లక్ష్మీకాంతం, నలుమాచు సుధాకర్, వల్లాల జగన్, తాటిపల్లి అంజయ్య, తాటిపల్లి శివకుమార్, దూసరాము తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గం

గంగాధర, జూలై 1: కోట్లనర్సింహులపల్లి మున్నూరుకాపు సంఘం కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిలువేరి గంగన్న, ప్రధాన కార్యదర్శిగా సుంకరి మల్లేశం, ఉపాధ్యక్షుడిగా వెంజాల కొమురయ్య, సంయుక్త కార్యదర్శిగా సుంకరి లచ్చయ్య, కోశాధికారిగా పురుమల్ల మహేశ్, కార్యవర్గ సభ్యులుగా రాచమల్ల మల్లయ్య, మంద అంజయ్య, జంగిలి రాజారాం తోట వెంకన్న, కట్నం శ్రీనివాస్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులను గ్రామ మున్నూరుకాపు సంఘం సభ్యులు అభినందించారు.

గొర్రెల కాపరుల సంఘం అధ్యక్షుడికి సన్మానం

కనకయ్యను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

గంగాధర, జూలై 1: గర్శకుర్తి గ్రామ గొర్రెల కాపరుల సంఘం అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన పుల్ల కనకయ్యను ఎన్నుకున్నారు. కాగా, గర్శకుర్తి జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల 1993-94 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు సోమవారం కనకయ్యను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ కార్యదర్శి పల్ల మల్లిక్, నాయకుడు అలువాల తిరుపతి పాల్గొన్నారు.

చొప్పదండిలో చోరీ

చొప్పదండి, జూలై 1: పట్టణంలోని ఆంధ్రాబ్యాంక్ సమీపంలోని గుర్రం చంద్రకళారెడ్డి ఇంట్లో చోరీ జరిగింది. ఎస్ఐ ఉపేంద్రాచారి తెలిపిన వివరాల ప్రకారం.. చొప్పదండికి చెందిన గుర్రం చంద్రకళారెడ్డి తన ఇంటికి తాళం వేసి గత నెల 26న తిరుపతికి వెళ్లారు. అక్కడి నుంచి తిరుగు పయనమయ్యే సమయంలో బెల్లంపల్లి మండలం ఆకెనపల్లెలో ఉంటున్న తన అక్క కూతురుకు ఫోన్ చేసి, తమ ఇంటికి రమ్మని చెప్పడంతో ఆదివారం మధ్యాహ్నం ఆమె చొప్పదండి చేరుకొంది. అప్పటికే ఇంటి మెయిన్ డోరు తాళం పగులగొట్టి ఉండడంతో ఆమె చంద్రకళారెడ్డికి ఫోన్ చేసి తెలిపింది. సోమవారం తెల్లవారు జామున తిరిగి వచ్చిన చంద్రకళారెడ్డి, ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు క్లూస్ టీంతో విచారణ చేపట్టారు. 14 తులాల బంగారం, రూ.లక్ష నగదు, ఒక ఐ పాడ్, ఒక సాంసంగ్ పాడ్ కనిపించడం లేదని చంద్రకళారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు 'రైతు భరోసా'పై సమావేశం

గంగాధర, జూలై 1: గంగాధర వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం 'రైతు భరోసా'పై సమావేశం నిర్వహిస్తున్నట్లు చైర్మన్ దూలం బాలాగౌడ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. గంగాధర రైతు వేదికలో నిర్వహిస్తున్న సమావేశంలో పాలకవర్గం సభ్యులు, సహకార సంఘం పరిధిలోని రైతులు పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు.

3న చిగురుమామిడి రైతువేదికలో..

చిగురుమామిడి, జూలై 1: మండల కేంద్రంలోని రైతు వేదికలో ఈ నెల 3న 'రైతు భరోసా'పై అభిప్రాయ సేకరణకు అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నట్లు సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి తెలిపారు. సహకార సంఘం సభ్యులు, మండల రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మంత్రిని కలిసిన ఎంపీపీ, ఎంపీటీసీలు

చిగురుమామిడి, జూలై 1: రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఎంపీపీ కొత్త వినీతాశ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీలు సోమవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. కొద్దిరోజుల్లో జరిగే తమ పదవీ విరమణ కార్యక్రమానికి హాజరుకావాలని ఆహ్వానించారు. అనంతరం మంత్రిని శాలువాతో సన్మానించారు. ఇక్కడ బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఎంపీపీ భేతి రాజిరెడ్డి, ఎంపీటీసీల ఫోరం కన్వీనర్ మిట్టపల్లి మల్లేశం, ఎంపీటీసీలు పెసరి జమున, కొత్తూరు సంధ్య, అందె స్వప్న, మెడబోయిన తిరుపతి, ఏలేటి రవీందర్ రెడ్డి తదితరులున్నారు.

నగునూర్‌లో హైడ్రామా

కరీంనగర్ రూరల్, జూలై 1: నగునూర్ గ్రామంలోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాల తొలగింపునకు సోమవారం ఆర్ఐ రజినీకాంత్, వీఆర్వో, గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి రాగా, హైడ్రామా చోటుచేసుకున్నది. కబ్జాకు పాల్పడిన వ్యక్తి తన నిర్మాణాన్ని కూల్చివేయకుండా అడ్డుకున్నాడు. నిర్మాణాన్ని కూల్చితే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని రెవెన్యూ ఆర్ఐతో వాగ్వాదానికి దిగాడు. దీంతో ఆర్ఐ చేసేదేమీ లేక వెనుదిరిగారు.

6 నుంచి అమ్మవారి శాకంబరీ నవరాత్రులు

కరీంనగర్ రూరల్, జూలై 1: ఆషాఢ మాసం సందర్భంగా నగునూర్ గ్రామంలోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో ఈ నెల 6 నుంచి 21 వరకు శాకంబరీ నవరాత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మాధికారి, వేదపండితుడు పురాణం మహేశ్వర శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు ఉత్సవాల్లో పాలొనాలని కోరారు.